
సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 18 । జనవరి । 2023



సమస్యల పరిష్కారంలో విఫలం

అసంఘటిత కార్మిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్‌రెడ్డి అన్నారు. 8లో▸



ఉర్సుకు ఏర్పాట్లు పూర్తి

ఈ నెల 19నుంచి ప్రఖ్యాతి గాంచిన హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా ఉర్సుకు వక్ఫ్‌బోర్డు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 8లో▸

మెట్రో రైళ్లు కిటకిట

సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లిన నగరవాసులు తిరుగు పయనమయ్యారు. మంగళవారం నగరంలోని పలు మెట్రో స్టేషన్లు కిటకిటలాడాయి. మూడు మార్గాల్లో ప్రయాణికుల సంఖ్య సుమారు 4.5 లక్షల మార్కును చేరినట్లు మెట్రో వర్గాలు తెలిపాయి. టికెట్ కౌంటర్లు, ప్లాట్‌ఫారాలు కిక్కిరిశాయి. రద్దీకి అనుగుణంగా ప్రతి మూడు నిమిషాలకో రైలును నడిపామన్నాయి.

న్యూస్‌రీల్

వీఎంహోంలో మంత్రి కొప్పుల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోం పాఠశాలను మంగళవారం సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోం విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట ఎమ్మెల్సీ ఎల్.రమణ, సుధాకర్ ఉన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎడవెల్లి ప్రభుదాస్, వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాదవుల్లో రాజకీయ చైతన్యం పెరగాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మొయినాబాద్: యాదవుల్లో రాజకీయ చైతన్యం పెరగాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కోశాధికారి దారబోయిన శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యువజన అధ్యక్షుడు పెరమోని లక్ష్మీపతి యాదవ్ ఆధ్వర్యంలో 2023 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన అధ్యక్షుడు అయిలబోయిన రమేష్‌యాదవ్, జాతీయ యువజన కోఆర్డినేటర్ గొర్ల యశ్వంత్‌రాజ్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌యాదవ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సంతోష్ యాదవ్, హైదరాబాద్ యువజన అధ్యక్షుడు విజయ్‌కుమార్‌యాదవ్, నాయకులు మనీష్‌యాదవ్, మనియాదవ్, మల్లేష్‌యాదవ్, సుధాకర్‌యాదవ్, రవియాదవ్, యాదయ్య యాదవ్, రాజుయాదవ్, హనుమంత్‌యాదవ్, రవీందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి



రమేష్ యాదవ్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న సాయి యాదవ్

నందిగామ: యాదవులు ఐకమత్యంతో ఉండి హక్కులను సాధించుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ యాదవ్ అన్నారు. నందిగామలో మంగళవారం నిర్వహించిన మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని మామిడిపల్లికి చెందిన చీపిరి సాయి యాదవ్‌ను అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యూత్ సెక్రెటరీగా నియమించారు. అనంతరం రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జాతీయ గొర్రెల కాపరుల సంఘం కోఆర్డినేటర్ జశ్వంత్, మహాసభ జిల్లా అధ్యక్షుడు జగదీశ్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్ యాదవ్, నాయకులు మల్లేశ్ యాదవ్, వెంకటేశ్ యాదవ్, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడికి ఖండన

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడి చేసిన మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం సంఘం నాయకులు అదనపు కలెక్టర్ తిరుపతి రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా కోటగిరిలో దళిత ఉపాధ్యాయుడిని కులం పేరుతో దూషించడం ..బలవంతంగా దేవాలయానికి తీసుకెళ్లి బొట్టు పెట్టించడం.. వీధుల్లో తిప్పడాన్ని ఖండించారు. దాడులకు పాల్పడినవారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జి.కవిత, రుద్రకుమార్, పోచమోని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో..





ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ దేవేందర్ సింగ్ చౌహాన్

భారత్- న్యూజిలాండ్ మధ్య నేడు వన్డే క్రికెట్

- 2,500 మందికిపైగా పోలీసులతో భారీ బందోబస్తు
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



ఉప్పల్: ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు రాచకొండ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు రాచకొండ సీపీ దేవేందర్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. మంగళవారం ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మల్కాజిగిరి డీసీపీ రక్షితా కె.మూర్తి, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ గుప్తా, మల్కాజిగిరి ఏసీపీ నరేష్ రెడ్డితో కలిసి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

- 2,500 మంది పోలీసులు, 250 మందితో సెక్యూరిటీ వింగ్, 403 మంది ట్రాఫిక్ సిబ్బంది, 1091 మంది లా అండ్ ఆర్డర్, నాలుగు ప్లాటూన్ల టీఎస్ఎస్‌పీ బృందాలు, ఆరు ప్లటూన్ల ఆర్మ్‌డ్ సిబ్బంది, రెండు ఆక్టోపస్ టీంలు, మౌంటెడ్ పోలీస్, వజ్రా తదితర సిబ్బందితో భారీ బందోబస్తు.
- ఎస్‌బీ, సీసీఎస్, ఎస్‌ఓటీ, రెండు ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంటాయి. స్టేడియం పరిసర ప్రాంతాలు, స్టేడియంలో ప్రేక్షకులు కూర్చునే చోటు, వాహనాల పార్కింగ్ ప్రాంతాల్లో కలిసి మొత్తం 300 సీసీ కెమెరాలు ఉంటాయి.

సీసీ టీవీలతో గస్తీ..

- సీసీ టీవీల దృశ్యాలను ఎప్పటికప్పుడు వీక్షించేలా కమాండ్ కంట్రోల్ రూం. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో నిరంతర గస్తీ.
- పేలుడు పదార్థాలను గుర్తించేలా ప్రత్యేక టీంల ఏర్పాటు. బ్లాక్ టికెట్లను విక్రయించే వారిపై కఠిన చర్యలు. బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారిపై ఇప్పటికే నాలుగు కేసులు బుక్ చేశాం.

ఎక్కడ మహిళలుంటే అక్కడ షీ టీం

- ఉప్పల్ క్రికెట్ స్టేడియంలోకి వచ్చే మహిళల భద్రతకు ప్రాధాన్యం. ఎక్కడ మహిళలు ఉంటే అక్కడ షీటీంలు అందుబాటులో ఉంటాయి.

సూచించిన స్థలాల్లోనే పార్కింగ్

- హబ్సిగూడ చౌరస్తా నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు, రామంతాపూర్ విశాల్ మార్ట్ నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డు వరకు రోడ్డుకిరువైపులా ఎలాంటి వాహనాలను పార్క్ చేయొద్దు.
- కేటాయించిన స్థలాల్లోనే పార్కు చేయాల్సి ఉంటుంది. క్రికెట్ మ్యాచ్ చూసేందుకు వచ్చిన వారు టీఎస్ఐఐసీ స్థలంలోనే వాహనాలను పార్కు చేయాలి. ఏ వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో సూచించే బోర్డులను ఏర్పాటు చేశాం.

వీఐపీలకే గేట్ నంబర్ వన్

ఈసారి గేట్ నంబర్ వన్ నుంచి వీఐపీలకే అనుమతి ఉంటుంది. 12 నంబర్ గేట్‌ను గేట్ 1ఏగా గుర్తించి.. దాని ద్వారా జనరల్ పబ్లిక్‌కు అనుమతి ఇవ్వనున్నాం.

భారీ వాహనాల దారి మళ్లింపు

- బుధవారం ఉదయం నుంచే ట్రాఫిక్ మళ్లింపు ఉంటుంది. వరంగల్ నుంచి సికింద్రాబాద్ వైపు, సికింద్రాబాద్ నుంచి ఉప్పల్ వైపు, ఎల్‌బీ నగర్ నుంచి ఉప్పల్, సికింద్రాబాద్ వైపు వెళ్లే అన్ని భారీ వాహనాలను దారి మళ్లిస్తాం.
- వరంగల్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలను చెంగిచెర్ల, మల్లాపూర్‌ల మీదుగా దారి మళ్లిస్తాం.

సెల్‌ఫోన్లకు మాత్రమే అనుమతి

ప్రేక్షకుల నుంచి సెల్‌ఫోనక్లు తప్ప మరే ఇతర వస్తువులకు స్టేడియంలోకి అనుమతి ఉండదు.

తాగునీరు, తినుబండారాల విక్రయం

- తిను బండారాలు, తాగునీరు.. అన్ని రకాల ఆహార పదార్థాలను హెచ్‌సీఏ ద్వారా స్టేడియంలో విక్రయిస్తారు.
- సూచించిన రేట్లకే స్టాల్స్ నిర్వాహకులు వీటిని విక్రయించాలి. లేనిపక్షంలో పోలీసులు చర్యలు తీసుకుంటారు.

వీడని అయోమయం

నిషేధిత జాబితాలోనే పట్టా భూములు

- రైతుబంధు, రైతు బీమాకు నోచుకోని వైనం
- న్యాయం చేయాలంటూ ఫార్మా భూ బాధితుల ఆందోళనలు
- పట్టించుకోని అధికారులు



నానక్‌నగర్‌లో ఫార్మాసిటీకి సేకరించడానికి నిర్ణయించిన పట్టా భూమి

యాచారం: ఆ నాలుగు గ్రామాల రైతులను అయోమయం వీడడం లేదు. ఫార్మాసిటీ భూసేకరణకు సహకరించడం లేదనే అక్కసుతో సమాచారం లేకుండానే రైతుల పట్టా భూముల రికార్డులను అధికారులు టీఎస్ఐఐసీ పేరు మీద మార్చేశారు. తమ భూముల రికార్డులను ధరణిలో మార్చేసి న్యాయం చేయాలని రెండేళ్లుగా సీసీఎల్ఏ, కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే వారే లేరు. యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల్లో 19,333 ఎకరాల పట్టా, అసైన్డ్ భూమిని ఫార్మాకు సేకరించడానికి టీఎస్ఐఐసీ నిర్ణయించింది. యాచారం మండల పరిధిలోని నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో 6,150 ఎకరాల పట్టా భూమి, 3,701 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించడానికి అధికారులు నిర్ణయించారు. అసైన్డ్ భూ సేకరణలో ఇబ్బంది లేకున్నా పట్టా భూముల సేకరణలోనే రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది.

2,211 ఎకరాల పట్టా భూములపై తిరకాసు..

నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో ఇప్పటికే 3,939 ఎకరాల పట్టా భూమిని సేకరించిన రెవెన్యూ అధికారులు టీఎస్ఐఐసీకి అప్పగించారు. ఇంకా 2,211 ఎకరాల సేకరణలో రైతుల నుంచి సహకారం లేకుండా పోయింది. పలు మార్లు విజ్ఞప్తి చేసినా పట్టా భూములు ఇవ్వకపోగా అసలు ఫార్మానే వద్దనే వాదన బలంగా వినిపించింది. ఈ నేపథ్యంలో రైతులకు కనీస సమాచారం లేకుండానే పట్టా భూముల రికార్డులను ధరణిలో టీఎస్ఐఐసీ పేరు మీద మార్చేశారు. ఆలస్యంగా పసిగట్టిన రైతులు లబోదిబోమన్నారు. మొత్తం 2,211 ఎకరాల పట్టా భూమిలో 1,966 ఎకరాలకు అవార్డు పాసు చేసి పరిహారం డబ్బులను అథారిటీలో జమ చేశారు. మరో 245 ఎకరాలకు సంబంధించి కోర్టులో కేసులు ఉండగా అవార్డు పాసు చేయలేదు.

పాదయాత్ర చేసినా ఫలితం లేదాయె..

2,211 ఎకరాల పట్టా భూమిపై రైతులకు రైతుబంధు పథకం వర్తింపజేయాలని గత డిసెంబర్ 27,28 తేదీల్లో 'చలో ఆర్డీఓ కార్యాలయం' పేరిట భూబాధితులు పాదయాత్ర చేపట్టారు. వారికి పలు పార్టీల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు మద్దతు తెలిపారు. వారం, పది రోజుల్లో రైతులకు న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చినా ఫలితం లేకపోయింది. ప్రభుత్వం గత నెల 28 నుంచి రైతుబంధు కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. కానీ ఫార్మాకు భూసేకరణ చేసే గ్రామాల్లోని దాదాపు 1,500 మందికి పైగా రైతులకు చెందిన 2,211 పట్టా భూముల రికార్డులను వారి పేర్ల మీద ధరణిలో నమోదు చేయకపోవడంతో పథకం వర్తించడం లేదు.

ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరీక్షణ

తుర్కయంజాల్‌లోని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం వద్ద నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులు గంటల కొద్దీ నిరీక్షించారు. 'చలో ఆర్డీఓ కార్యాలయం' పేరిట పాదయాత్ర చేపట్టిన సమయంలో వారంలో భూముల రికార్డులను ధరణిలో నమోదు చేస్తామని ఆర్డీఓ వెంకటాచారి హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆయా గ్రామాల సర్పంచులు రాజశేఖర్‌రెడ్డి, రమేష్, పెద్దయ్య, పర్యావరణవేత్త కవుల సరస్వతి ఆధ్వర్యంలో మంగళవారం రైతులు పెద్ద సంఖ్యలో ఆర్డీఓ కార్యాలయం వెళ్లారు. గంటల కొద్దీ ఆర్డీఓ కోసం నిరీక్షించినా ఫలితం లేకపోయింది. ఆర్డీఓ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్నారనే సమాచారంతో అక్కడికి కూడా వెళ్లారు. అక్కడా లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. త్వరలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు.



తుర్కయంజాల్‌లోని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న రైతులు

కావాలనే కుట్ర..



ఫార్మాసిటీకి పట్టా భూములు ఇవ్వడం లేదనే అక్కసుతోనే అధికారులు కనీస సమాచారం లేకుండానే పట్టా భూములను రైతుల పేర్లు తీసేసి టీఎస్ఐఐసీ పేరు మీద మార్చేశారు. రైతుబంధు, రైతు బీమా వర్తించడం లేదు. అత్యవసర సమయాల్లో అమ్ముదామన్నా కుదరడం లేదు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– దంతుక పెద్దయ్య, సర్పంచ్, నానక్‌నగర్

కవన కుతూహలం

- 27 నుంచి 29 వరకు హైదరాబాద్ సాహిత్యోత్సవం
- తరలిరానున్న కవులు, కళాకారులు, మేధావులు



సాక్షి, సిటీబ్యూరో: వైవిధ్యభరితమైన హైదరాబాద్ సాహితీ ఉత్సవం (హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్) 13వ ఎడిషన్‌కు నగరం సన్నద్ధమవుతోంది. ఈ నెల 27 నుంచి 29 వరకు విద్యారణ్య స్కూల్ వేదికగా వేడుకలు జరగనున్నాయి. కోవిడ్ కారణంగా రెండేళ్ల పాటు నిలిచిపోయిన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌ను ఈసారి ఘనంగా నిర్వహించేందుకు హెచ్ఎల్ఎఫ్ ఏర్పాట్లు పూర్తి చేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విభిన్న కళలు, సాహిత్యం, సంస్కృతులను ఒకే వేదికపైకి తెచ్చేందుకు ఏటా హైదరాబాద్ సాహిత్యోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2010 నుంచి నిరాటంకంగా (కోవిడ్ కాలం మినహా) జరుగుతున్న లిటరరీ ఫెస్టివల్ అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రాచుర్యాన్ని గడించింది. ప్రపంచంలోని అనేక దేశాలకు చెందిన ప్రముఖులు, సాహితీవేత్తలు, రచయితలు, కవులు, కళాకారులు, భిన్న భావజాలాలు, విభిన్న జీవన సమూహాలను ప్రతిబింబించే కళారూపాలకు, సాహిత్య, సాంస్కృతిక ప్రక్రియలకు ఇది వేదికగా నిలిచింది. మూడు రోజుల పాటు సాహితీ ప్రియులను అక్కున చేర్చుకొని సమకాలీన సాహిత్య, సామాజిక అంశాలపై లోతైన చర్చలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

అతిథి దేశంగా జర్మనీ

హెచ్ఎల్ఎఫ్ 13వ ఎడిషన్‌కు జర్మనీ అతిథి దేశంగా హాజరు కానుంది. ఆ దేశానికి చెందిన పలువురు రచయితలు, మేధావులు భాగస్వాములు కానున్నారు. ప్రముఖ జర్మనీ యువ నవలా రచయిత్రి ఎవేన్‌కో బుక్కోసీ ఈ వేడుకల్లో పాల్గొంటారు. జర్మనీ సాంస్కృతిక, కళారూపాలను ఈ సందర్భంగా ప్రదర్శించనున్నారు.


కొంకణి సాహిత్యం ఎంపిక

ఈ ఏడాది కొంకణి భాషా సాహిత్యాన్ని భారతీయ భాషగా ఎంపిక చేశారు. గతేడాది జ్ఞానపీఠ అవార్డు పొందిన కొంకణికి చెందిన ప్రముఖ రచయిత దామోదర్ మాజో ఈ వేడుకల్లో కీలకోపన్యాసం చేయనున్నారు. కొంకణి భాషా చిత్రాల దర్శకుడు బార్డ్‌రాయ్‌బరెక్టో పాల్గొంటారు. కొంకణి నృత్యాలు, జానపద కళలను ప్రదర్శించనున్నారు.

ప్రముఖుల ప్రసంగాలు

ప్రఖ్యాత దర్శకుడు దీప్తీ నవల్, ప్రముఖ పాత్రికేయుడు, రచయిత పాలగుమ్మి సాయినాథ్, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత మానస ఎండ్లూరి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ నుంచి గీతా రామస్వామి, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు ప్రసంగించనున్నారు. జర్మనీతో పాటు అమెరికా, బ్రిటన్, ఐర్లాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన రచయితలు, కళాకారులు, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 250 మందికి పైగా ప్రతినిధులు వేడుకల్లో పాల్గొంటారు. వేడుకల్లో భాగంగా హైదరాబాద్ చారిత్ర వైభవాన్ని, వాస్తు నైపుణ్యాన్ని ప్రతిబింబించే పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉషా ఆకెళ్ల రూపొందించిన 'హమ్ ఐసీ బాత్' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు.

ఇది అందరి వేడుక



హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. ఈసారి మెట్రో రైల్ ప్రత్యేక ప్రచారం నిర్వహించనుంది. ఖైరతాబాద్ నుంచి విద్యారణ్య స్కూల్ వరకు మూడు రోజుల పాటు ప్రతి 15 నిమిషాలకో ఉచిత ట్రిప్పును ఏర్పాటు చేయనుంది.

– ప్రొఫెసర్ విజయ్‌కుమార్

గొర్రెలకాపరులు ఆర్థిక ప్రగతి సాధించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని గొర్రెల, మేకల పెంపకందారులు ఆర్థిక ప్రగతి సాధించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, అదనపు కలెక్టర్ తిరుపతి రావు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా 2023 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గొర్రెల,మేకల పెంపకందారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పగుడాల యాదయ్య, ప్రధాన కార్యదర్శి అమీర్‌పేట మల్లేశ్, జిల్లా అధ్యక్షుడు గౌర శ్రీశైలం, ఉపాధ్యక్షుడు పెంటయ్య, నాయకులు మల్లేశ్, కృష్ణ, మల్లయ్య పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను జయప్రదం చేయండి



వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సబితారెడ్డి

- వైద్యాధికారులతో మంత్రి సబితారెడ్డి సమీక్ష

మీర్‌పేట: రాష్ట్రంలో ఈనెల 18వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాలో కంటి వెలుగు అమలుపై మంగళవారం మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డు, కార్పొరేషన్ డివిజన్లలో కంటి పరీక్షల శిబిరాలు నిర్వహించి అవసరం ఉన్న వారికి అద్దాలు అందజేస్తామని తెలిపారు. వైద్యశాఖ, పంచాయతీ, మున్సిపల్ ఇతర శాఖలతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థలు, ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. మొదటి విడత కంటి వెలుగులో పెద్ద సంఖ్యలో పరీక్షలు చేసి 1.54 కోట్ల మందికి స్క్రీనింగ్, 50 లక్షల మందికి కళ్లద్దాలు ఇచ్చినట్లు వివరించారు. మొదటి విడత కార్యక్రమం 8 నెలలు నిర్వహించగా, రెండో విడత వంద రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. పరీక్షలు చేసిన నెల రోజుల్లోనే అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. జిల్లాలో 80 బృందాలు ఏర్పాటు చేశామని, అదనంగా మరో 5 బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు. ఈ నెల 19న మహేశ్వరం నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమానికి శ్రీకారం చుడతామని మంత్రి వివరించారు. సమీక్షలో జిల్లా వైద్యాధికారి బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆశల పల్లకిలో టీచర్లు!

- పదోన్నతులు.. బదిలీల వ్యవహారం
- అర్హుల జాబితా సిద్ధం
- అధికారుల కసరత్తు పూర్తి
- 394 మందికి అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఉపాధ్యాయుల్లో ఆశలు చిగురించాయి. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతులు, బదిలీలకు మోక్షం లభించనుంది. సుమారు ఏడున్నర సంవత్సరాల తర్వాత అర్హులైన టీచర్లకు ప్రమోషన్లు, బదిలీలు చేపట్టేందుకు నిర్ణయించిన నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాల్లో సుమారు 394 మందికి అవకాశం దక్కనుంది. వాస్తవంగా వివిధ కేటగిరీల్లో మొత్తం 516 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో 70 శాతం కింద పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తుండగా, మిగతా 30 శాతం (122) పోస్టులను టీచర్స్ రిక్రూట్‌మెంట్(టీఆర్టీ) ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. గెజిటెడ్ హెచ్ఎం గ్రేడ్-2, డిప్యూటీ ఐఓఎస్ పోస్టులను పూర్తిగా పదోన్నతులతో నింపనున్నారు. ఇదిలా ఉండగా, పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాను ఇప్పటికే జిల్లా అధికారులు ఇప్పటికే తయారు చేశారు. ప్రభుత్వం ప్రమోషన్ నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే అందజేసేందుకు సిద్ధమయ్యారు.

ఖాళీల జాతర

జిల్లా విద్యా శాఖలో పర్యవేక్షక అధికారుల పోస్టుల సైతం ఏళ్ల తరబడి భర్తీ చేయకపోవడంతో ఖాళీల జాతరా కొనసాగుతోంది. సీనియర్ హెచ్ఎం లకు అదనపు బాధ్యతలు అప్పగించి కొనసాగిసుతన్నారు. మొత్తం మీద జిల్లా విద్యాశాఖలో అన్ని విభాగాల్లో ఇన్‌చార్జిల పాలనే కొనసాగుతోంది 12 డిప్యూటీ ఈఓ పోస్టుల్లో అన్ని ఖాళీగానే ఉన్నాయి. సీనియడ్ గెజిటెడ్ హెడ్మాస్టర్లతోనే ఆయా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 24 డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డీఐఓఎస్) పోస్టుల్లో 23 ఖాళీ గా ఉండగా ఒకరు మాత్రమే రెగ్యులర్ అధికారిగా విధులు నిర్వరిస్తున్నారు అలాగే 10 గెజిటెడ్ హెడ్మాస్టర్ పోస్టుల్లో పది ఖాళీ ఉండగా, 171 ప్రధానోపాధ్యాయుల్లో 86 ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది.

వెంటాడుతున్న కొరత

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల భర్తీ లేకుండా పోయాయి. పలు పాఠశాలల్లో నాలుగైదేళ్ల నుంచి స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు,వ్యాయామ ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందుతున్నప్పటికీ, వారి స్థానాలను భర్తీ చేయకపోవడంతో విద్యార్థుల బోధన ప్రశ్నార్థకంగా తయారైంది. మరోవైపు పదోన్నతులు కూడా లేకుండా పోయాయి. 2016 తర్వాత నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టక పోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న వారిపైనే బోధన భారం పడుతోంది.

- హైదరాబాద్ జిల్లాలోని 508 ప్రాథమిక, ప్రాథమి కోన్నత పాఠశాలలు ఉండగా, 182 హైస్కూళ్లు ఉండగాఅందులో సుమారు 6,200 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, పీఈటీలు, లాంగ్వేజ్ పండిట్‌లు ఉన్నట్లు విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రక్రియ ఇలా..

- ఉపాధ్యాయ పదోన్నతులకు సంబంధించి సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)లు స్కూల్ అసిస్టెంట్లు (ఎస్‌ఏ)గా, ఎస్‌ఏలు ప్రధానోపాధ్యాయులు(హెచ్ఎం)గా పదోన్నతులు పొందనున్నారు.
- ప్రస్తుతం పనిచేస్తున్న చోట ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్నవారికి బదిలీల వర్తించనున్నాయి. పోస్టులు కేటాయించే క్రమంలో సీనియారిటీకి ప్రాధాన్యమిస్తారు.
- ప్రధానోపాధ్యాయులకు మాత్రం ఐదేళ్లు ఒకే దగ్గర విధులు నిర్వర్తించినవారికి బదిలీ వర్తిస్తుంది.

ఖాళీలు ఇలా..

హైదరాబాద్ జిల్లాలోని సర్కారు బడుల్లో గజిటెడ్ హెచ్ఎం గ్రేడ్-11 డిప్యూటీ ఐఓఎస్, ఎస్ఏ మాథ్స్,ఫిజిక్స్, బయోసైన్స్, సోషల్, ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ, హింది, పీఈడీ సబ్జెక్టుల్లో సుమారు 514 వివిధ పోస్టులు ఖాళీగా ఉండగా 70 శాతం కింద సుమారు 392 పోస్టులు పదోన్నతులు, బదిలీల ద్వారా భర్తీ కానున్నాయి. ఉర్దూ మీడియంలో 234 ఖాళీలకు గాను 173, తెలుగుమీడియంలో 206 ఖాళీలకు గాను 157, ఇంగ్లిష్ మీడియంలో 51 ఖాళీలకు గాను 38 భర్తీ కానున్నాయి.

వరద విపత్తులు ఎదుర్కొనేలా సరికొత్త ప్రణాళిక

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఎదురయ్యే ఎటువంటి వాతావరణ పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు క్లైమేట్ రెసీలియెంట్ సిటీగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. దీన్ని అమలు చేసేందుకు జీహెచ్ఎంసీతోపాటు వాటర్ బోర్డు, భూగర్భ జలవనరుల శాఖ, ఈపీటీఆర్ఐలు సంయుక్తంగా పనిచేయనున్నాయి. వరల్డ్‌బ్యాంక్ సహకారంతో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని భావిస్తున్నారు. నగరంలో ఎంపిక చేసిన పది ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేయనున్నారు.

చెరువులో వ్యక్తి మృతదేహం

మీర్‌పేట: చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అల్మాస్‌గూడ పోచమ్మకుంటలో గుర్తు తెలియని వ్యక్తి (30) మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. ఆత్మహత్యా లేక ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉంటాడా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- రేపటి నుంచి జేపీ దర్గా ఉత్సవాలు
- మూడు రోజుల పాటు ప్రార్థనలు
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

కొత్తూరు: ప్రఖ్యాతి గాంచిన హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లను వక్ఫ్‌బోర్డు అధికారులు పూర్తి చేశారు. ఈ నెల 19నుంచి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల దృష్ట్యా వక్ఫ్‌బోర్డు అధికారులు ఇప్పటికే దర్గా ఆవరణలో స్తంభాలు, మినార్లు ఏర్పాటు చేసి వాటిని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా షాద్‌నగర్ ఏసీపీ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

దర్గా ప్రాశస్త్యం

మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో వెలసిన జహంగీర్‌పీర్ దర్గా ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధిగాంచింది. మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంతరించుకుంది. క్రీ.శ. 15వ శతాబ్దంలో మొగల్ చక్రవర్తుల కాలంలో ఇరాక్ దేశానికి చెందిన సయ్యద్ గౌసొద్దీన్, బురానొద్దీన్ అనే ఇద్దరు సోదరులు ఇన్ముల్‌నర్వలోని దట్టమైన అటవీ ప్రాంతానికి వచ్చారు. వారు ఇక్కడే కొంతకాలం పాటు ఉంటూ తమ కుల దైవాన్ని స్మరించుకుంటూ కాలధర్మం చెందారు. వీరి సమాధులపైనే చిన్న దర్గాలను నిర్మించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు దక్కన్‌పై దండెత్తి వచ్చిన సమయంలో, అతని కొలువులో ఉన్న పండితుడు ఒకరు దర్గాను దర్శించి దాని విశిష్టతను గుర్తించి ఔరంగజేబుకు తెలిపారు. దీంతో ఆయన దర్గాను దర్శించుకుని సలామ్ అని నమస్కరించగా, సమాధుల నుంచి ప్రతి సలామ్ అనే శబ్దం వచ్చింది. దర్గా మహత్యాన్ని గుర్తించిన చక్రవర్తి 16వ శతాబ్దంలో ఇబ్రహీం అలీ అనే పండితున్ని దర్గాకు సంరక్షకుడిగా నియమించారు.



జేపీదర్గా

ఏర్పాట్లు పూర్తి

జహంగీర్‌పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 19న గంధోత్సవం, 20న దీపారాధన, 21న ఖత్మే ఖురాన్‌తో ఉత్సవాలు ముగియనున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు హైదరాబాద్, ఇతర జిల్లాలు, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. మొదటి రెండు రోజులు అధిక సంఖ్యలో భక్తులు దర్గాను దర్శించుకుంటారు. వారిలో చాలా మంది దర్గా ఆవరణలోనే రాత్రిళ్లు ప్రార్థనలు, భజనలు చేసి అక్కడే నిద్రిస్తారు. వారి కోసం వక్ఫ్‌బోర్డు అధికారులు రెండు రోజుల పాటు రాత్రిపూట భోజన, తాగునీటి వసతి, నిద్రించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక బస్సు సర్వీసులు

ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు కొనసాగనున్నాయి. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో మూడు రోజులు పాటు దర్గా ఆవరణలోకి ఎలాంటి వాహనాలను అనుమతించకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. దర్గాకు చేరుకునే రెండు రోడ్లలోనూ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను లోపలికి వెళ్లకుండా పార్కింగ్ స్థలానికి చేరుకునేలా చర్యలు చేపట్టారు.



దర్గా ఆవరణలో ఏర్పాటైన స్టాళ్లు

స్టాళ్ల ఏర్పాటు

ఉత్సవాల సందర్భంగా దర్గా ఆవరణలో పదుల సంఖ్యలో వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. చిన్నారుల ఆట వస్తువులు, మహిళల గాజులు విక్రయించే స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటికి తోడు దర్గా ఆవరణలో రంగుల రట్నాలు.. ఇతర ఆట యంత్రాలను ఏర్పాటు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ తెలంగాణ మైనారిటీ గురుకుల బాలురు పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 2023 – 24 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతిలో ముస్లిం మైనార్టీలు, క్రైస్తవ, జైన, బుద్ధ, పార్శీ, హిందూ విద్యార్థులకు ప్రవేశం పొందేందుకు, అలాగే 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న మైనార్టీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 17 నుంచి 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వ్యాయామ విద్య, కంప్యూటర్ శిక్షణ, రోబోటిక్, పుస్తకాలు, దుస్తులు, స్టేషనరీ ఉచితంగా అందిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ల 8309540774, 9966533665లో సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీగా మధు

షాద్‌నగర్ రూరల్: యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పట్టణానికి చెందిన మధు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ నూతన కమిటీ సభ్యుల పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో పని చేసే నాయకులకు తప్పని సరిగా గుర్తింపు లభిస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ఆహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. నా నియామకానికి సహకరించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, స్టార్ క్యాంపెయిన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జ్ సురభి, జాతీయ మాజీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం టీపీసీసీ సభ్యుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ మధును ఘనంగా సన్మానించారు.



మధును సన్మానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

జాతీయ అవార్డుకు ఎంపీటీసీ ఎంపిక

చేవెళ్ల: బహుజన సాహిత్య అకాడమీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు చేవెళ్ల మండలం అల్లవాడ ఎంపీటీసీ సత్యనారాయణచారిని ఎంపిక చేశారు. మంగళవారం బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు మలగళ్ల మల్లేశ్ గౌతమ్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం జరిగింది. జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా సత్యనారాయణచారి ఎంపిక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి మహనీయుల ఆలోచనల కోసం నిరంతరం కృషి చేస్తున్న వివిధ రంగాలకు చెందిన వారు కవులు, కళాకారులు, జర్నలిస్టులు, కార్మికులు, కర్షకులు, రాజకీయ వేత్తలు, సంఘ సేవకుల ప్రతిభను గుర్తించి జాతీయ అవార్డులకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. మార్చి 12న ఏపీలోని తిరుపతిలో జరిగే జాతీయ 6వ కాన్ఫరెన్స్‌లో వీరికి అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అకాడమీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్, రాష్ట్ర కో కన్వీనర్ విష్ణు, సేవారత్న జాతీయ అవార్డు గ్రహీత కే ఆనంద్, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మణ్, బాలరాజ్, వడ్ల వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణచారికి ఎంపిక పత్రం అందజేస్తున్న నల్లా రాధాకృష్ణ

ఉత్తమ పురస్కారాలకు ఎంపిక

షాద్‌నగర్ టౌన్: స్వామి వివేకానంద జయంతి వారోత్సవాల ముగింపు సందర్భంగా తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం వారు ఉత్తమ సేవా కార్యక్రమాలకు గాను పురస్కారాలను అందజేస్తున్నారు. 2023 సంవత్సరానికి ఈ పురస్కారాలకు ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మఠం శిఖర్, షాద్‌నగర్ పట్టణానికి చెందిన న్యాయవాది సన్నిధానం కృష్ణశర్మ ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ నెల 19న హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో పురస్కారాలు అందజేయనున్నట్లు ఫోరం కోఆర్డినేటర్లు రాజేందర్, హేమంత్ తెలిపారు.

బాల కార్మికుల గుర్తింపు

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని పలు దుకాణాల్లో పని చేస్తున్న బాల కార్మికులను పోలీసులు గుర్తించారు. మంగళవారం కాలేజీ రోడ్డులోని శివాజీ చౌక్ వద్ద పలు దుకాణాల్లో చిల్డ్రన్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధి సంజీవ ఫిర్యాదు మేరకు ఆపరేషన్ స్మైల్ టీం సభ్యులు ఆకస్మిక దాడులు చేశారు. దుకాణాల్లో పని చేస్తున్న ఇద్దరు చిన్నారులను అధికారులు గుర్తించారు. పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా బాల కార్మికులను పనిలో పెట్టుకున్న రెండు దుకాణాల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

కార్మిక సమస్యల పరిష్కారంలో విఫలం

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: అసంఘటిత కార్మిక సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్ల దేవేందర్‌రెడ్డి ఆరోపించారు. పెద్ద అంబర్‌పేట్ లారీ డ్రైవర్స్ యూనియన్ కార్మికులు మంగళవారం స్థానిక గండి మైసమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య, మండల కార్యదర్శి హరిసింగ్ నాయక్‌లతో కలిసి హాజరై మాట్లాడారు. అసంఘటిత కార్మిక సమస్యలు రోజు రోజుకూ పెరిగిపోతున్నా వీరికి ఆర్థిక భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రధాని మోడీ తెచ్చిన నూతన ట్రాన్స్‌పోర్టు చట్టం డ్రైవర్లకు గుదిబండగా మారిందన్నారు. భవిష్యత్తులో వీరి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆమనగంటి వెంకన్న, మండల కార్యదర్శి హరిసింగ్ నాయక్, ఆర్టీసీ నాయకులు కేతరాజు నరసింహ, యూనియన్ నాయకులు కృష్ణ, హరికృష్ణ, పాండు, రఘు, శ్రీనివాస్, లక్ష్మయ్య పాల్గొన్నారు. అనంతరం కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

క్లుప్తంగా

పరిశోధనలో ప్రొఫెసర్ సుజాతకు గుర్తింపు



ప్రొఫెసర్ పర్వేద సుజాత

షాబాద్: భారత్ – మయన్మార్ ద్వైపాక్షిక సంబంధాలు, వర్తక వాణిజ్యం సవాళ్లు, అవకాశాలపై పరిశోధనలు జరిపిన వారితో ప్రొఫెసర్ పర్వేద సుజాత దేశంలోనే మూడో వ్యక్తిగా నిలిచారు. మారుమూల గ్రామం, సాధారణ కుటుంబం నుంచి వచ్చిన సుజాత అంచెలంచలుగా ఎదుగుతూ వచ్చారు. సంగారెడ్డి డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమెది రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం ముద్దెంగూడ గ్రామం. చిన్నతనం నుంచే చదువులో చురుగ్గా ఉంటూ కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివి ప్రొఫెసర్ స్థాయికి ఎదిగారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ కే బెంజిమెన్ ఆధ్వర్యంలో భారత్ – మయాన్మార్ ద్వైపాక్షిక సంబంధాలు, వర్తక వాణిజ్యం సవాళ్లు అవకాశాలు అనే అంశం పైన పరిశోధనలు పూర్తి చేశారు. ఈ అంశంపై భారత దేశంలోనే పరిశోధనలు జరిపిన మూడో వ్యక్తిగా గుర్తింపు పొందారు. షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతి మహేందర్‌రెడ్డి, పలువులు నాయకులు ప్రొఫెసర్ పర్వేద సుజాతను అభినందించారు.

విజేతలకు బహుమతులు అందజేత



మాన్యగూడలో వాలీబాల్ నిర్వాహకులతో క్రీడాకారులు

కందుకూరు: కందుకూరు మండలం నేదునూరు పరిధిలోని మాన్యగూడలో సంక్రాంతి పండుగ సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు గ్రామానికి చెందిన సి.బాలయ్య రూ.3 వేలు, కడెం నర్సింహ రూ.1,500తో పాటు షీల్డ్‌లను అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో యువకులు శివకుమార్, చంద్రశేఖర్, సూర్యప్రకాష్, చందు, శ్రీకాంత్, విక్కీ, విష్ణు, శ్రీరామ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం



రేఖాదేవి (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రావిర్యాల గ్రామానికి చెందిన సంతోష్, రేఖాదేవి(25)లకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 15న రేఖాదేవి ఇంటి నుంచి బయటికి వెళ్లింది. గమనించిన భర్త ఆమె ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోయింది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్, లేదా సెల్ నంబర్ 94906 17241లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

పోలీసుల అదుపులో కీచక తండ్రి

మాడ్గుల: ఆమనగల్లు మండలం మంగలపల్లి పంచాయతీ పరిధిలోని చెన్నకేశవ కాలనీలో చోటు చేసుకున్న కన్న కూతురుపై అత్యాచారానికి పాల్పడిన తండ్రిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నకేశవ కాలనీకి చెందిన దంపతులు ఆరు నెలల క్రితం తమ పెద్ద కుమార్తెను తీసుకుని బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ తల్లికి హోటల్‌లో పనికి కుదిరింది. తల్లి రోజు పనికి వెళ్లిన సమయంలో తండ్రి కూతురును బెదిరించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో కూతురు గర్భం దాల్చింది. సంక్రాంతి పండుగకు సొంత ఊరికి వచ్చిన సదరు బాలిక తనపై తండ్రి చేసిన అఘాయిత్యాన్ని నానమ్మతో చెప్పుకుంది. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కీచక తండ్రిని చితకబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడు రాజును అదుపులోకి తీసుకున్నారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుందరయ్య తెలిపారు.